## యాదగిరీశుడి సేవలో వానమాములై రామానుజ జీయర్‌స్వామి

వానమాములై రామానుజ జీయర్‌స్వామికి పండ్లు, ప్రసాదం అందజేస్తున్న ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట, జూన్ 9 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి సేవలో మహదాచార్య ఉభయ వేదాంత పరమహంస పరవాజకచార్య వానమాములై పీఠాధీశ్వరులు వానమాములై రామానుజ జీయర్ స్వామి పాల్గొని తరించారు. ఆదివారం తన పరివారంతో స్వయంభూ పంచనారసింహ క్షేత్రానికి చేరుకున్నారు. లిఫ్ట్ మార్గం గుండా తిరుమాఢవీధుల్లోకి చేరుకుని ఉత్తర రాజగోపురం గుండా స్వామివారి ప్రధానాలయంలోకి ప్రవేశించారు. ఈ సందర్భంగా ప్రధానార్చక బృందం స్వామీజీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామీజీ స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ముఖ మండపంలో భక్తులకు ప్రవచనాలు వినిపించారు. నృసింహస్వామి వైభవాన్ని వివరించారు. స్వామివారికి మంగళ శాసనాలు, భక్తులకు ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు స్వామీజీకి పండ్లు, స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని బహూకరించారు. కాగా, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో 300 ఏండ్ల కిందట అప్పటి వానమాములై పీఠాధీశ్వరులు వానమాములై జీయర్‌స్వామి లక్ష్మీనరసింహస్వామివారికి నిర్వహించాల్సిన సేవలను క్రమబద్ధీకరించారు.

## చింతపల్లిలో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం

చింతపల్లిలో స్వామి,అమ్మవార్ల తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు నల్లన్‌భీఘశ్ లక్ష్మీనరసింహాచార్యులు

యాదగిరిగుట్ట, జూన్ 9 : నల్లగొండ జిల్లా చింతపల్లి గ్రామంలో షిర్డీ సాయిసేవా సమితి ట్రస్టు అభ్యర్థన మేరకు గ్రామంలోని శ్రీసాయి సన్నిధిలో యాదగిరిగుట్ట లక్ష్మీ నర్సింహస్వామి, అమ్మవార్ల తిరుకల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాదగిరిగుట్ట ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌భీఘశ్ లక్ష్మీనరసింహాచార్యుల బృందం విశ్వక్సేనారాధన, స్వస్తీవాచనంతో కల్యాణ తంతు ప్రారంభించి అమ్మవారి మెడలో మాంగళ్యధారణ వరకు వేడుకను కనుల పండువగా జరిపించారు. కార్యక్రమంలో షిర్డీ సాయి సేవా సమితి సభ్యులు, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## కట్టమైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే సామేల్ పూజలు

కట్టమైసమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, జూన్ 9 : మున్సిపాలిటీ కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్‌పై నూతనంగా నిర్మించిన కట్టమైసమ్మ ఆలయంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదివారం పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం

రాజాపేటలో మంగళ సూత్రాలను చూపిస్తున్న పూజారులు

రాజాపేట, జూన్ 9 : మండల కేంద్రంలోని మఠం వేంకటేశ్వరాలయంలో ఆదివారం నేస్తం ఫ్రెండ్స్ అధ్వర్యంలో తిగుళ్ల రామ్మూర్తిశర్మ వేద మంత్రోత్సవాల మధ్య భూదేవి, శ్రీదేవీ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం గ్రామ వీధుల్లో స్వామివారి పల్లకీ సేవ నిర్వహించగా..మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు సత్యనారాయణదాసు, రామేశ్వర్‌దాసు, గౌరవదాసు, నేస్తం ఫ్రెండ్స్ యూత్, భక్తులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంతో భూమికి మేలు

బొమ్మలరామారం, జూన్ 9 : సేంద్రియ వ్యవసాయంతోనే భూమికి మేలు జరుగుతుందని గ్రామ భారతి మండల కన్వీనర్ బొమ్మకంటి మల్లేశ్ అన్నారు. మండలంలోని ఫక్కీర్‌గూడ, మేడిపల్లి గ్రామాల రైతులకు ఆదివారం సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గో ఆధారిత వ్యవసాయం చేయడం ద్వారా రసాయనిక ఎరువుల వాడకం తగ్గించవచ్చన్నారు. భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే సేంద్రియ వ్యవసాయానికి ప్రాముఖ్యత ఇవ్వక తప్పదని పేర్కొన్నారు. సేంద్రియ వ్యవసాయం చేయాలనుకునే రైతులకు విత్తనాలు, శిక్షణ అందజేస్తామని తెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

భూదాన్ పోచంపల్లి, జూన్ 9 : పాఠశాలలో చదువుకున్న స్నేహితుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు చేయూతనందించారు. మండలంలోని గౌస్‌కొండ గ్రామానికి చెందిన కొయ్యడ నరసింహ (37) గత నెలలో అనారోగ్యంతో మృతిచెందాడు. పోచంపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 2001-02 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మృతుడి కుటుంబానికి ఆదివారం రూ.67వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాలనరసింహ, మధుసూదన్ రెడ్డి, బాలరాజు, ఎండీ అక్బర్, భాను, బాబు, లింగస్వామి, యాదగిరి, కృష్ణ, పాండు, వెంకటేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

భువనగిరి కలెక్టరేట్, జూన్ 9 : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి భీమారి నర్సింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భవన నిర్మాణ రంగాల కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడాలని, అందుకోసం వెల్ఫేర్ బోర్డు చైర్మన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ రంగాల కార్మికులు వేలాదిగా తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

# మైనార్టీల సంక్షేమానికి సర్కారు కృషి

- భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

శివారెడ్డిగూడెంలో మసీద్‌ను ప్రారంభించి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, జూన్ 9 : మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని శివారెడ్డిగూడెంలో దాతలు మహమ్మద్ ఆరిఫ్, ఆసిఫ్, మహమ్మద్ జావీద్ సహకారంతో రూ.45 లక్షలతో నిర్మించిన (మజీద్ ఈ ఖాజా బేగం) మసీదును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ముస్లింలు శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం జూలూరు – రుద్రవెల్లిలో లెవెల్ బ్రిడ్జిని పరిశీలించి మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పలు పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. జూలూరు – రుద్రవెల్లిలో లెవెల్ బ్రిడ్జి మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్త బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్‌రెడ్డి, నాయకులు మర్రి నర్సింహారెడ్డి, వెంకటేశ్‌యాదవ్, ప్రకాశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, మహేశ్, రామకృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, లింగస్వామి, సంతోష్, లింగారెడ్డి, ఆరీఫుద్దీన్, షరీఫ్, మదార్, కరీం షేక్, రసూల్, సయ్యద్, మిరాన్ పాల్గొన్నారు.

## విద్యార్థుల సంఖ్యను పెంచేందుకే బడిబాట



ఆత్మకూరు(ఎం) : పల్లెర్లలో బడిబాట ర్యాలీలో ప్రచార కరపత్రాలు అందజేస్తున్న హెచ్‌ఎం స్వామి

ఆత్మకూరు(ఎం), జూన్ 9 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం చేపట్టిందని పల్లెర్ల, కప్రాయపల్లి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దొడ్డి స్వామి, దడిపెల్లి వెంకన్న అన్నారు. ఆదివారం తుక్కాపురం, పారుపల్లి గ్రామాల్లో బడిబాట ర్యాలీలు నిర్వహించి బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ ప్రజలకు అవగాహన కల్పించారు.

ఆలేరు రూరల్ : బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ స్కూళ్లలో అందుతున్న వసతులను వివరించారు.

ఆలేరు రూరల్ : కొలనుపాకలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

## 'ఉపాధ్యాయ సమస్యలపై ఎస్‌టీయూ అలుపెరగని పోరాటం'

చౌటుప్పల్ రూరల్, జూన్ 9 : ఉపాధ్యాయ సమస్యలపై ఎస్‌టీయూ టీఎస్ నిరంతర పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి రమేశ్ అన్నారు. ఎస్‌టీయూ 78వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చౌటుప్పల్‌లోని సంఘం కార్యాలయం వద్ద ఆదివారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్దుం మొయినొద్దీన్ అధ్వర్యంలో ఏర్పాటైన ఎస్‌టీయూ నేటికీ ఉపాధ్యాయ, విద్యార్థి, పాఠశాలల సమస్యలపై పని చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి దేవులపల్లి గణేశం, నాయకులు శ్రీనివాస్, బి.జంగయ్య, చంద్రమౌళి, మట్టయ్య, నర్సింహ, నర్సిరెడ్డి, దానయ్య పాల్గొన్నారు.

## కొండపైన పెండింగ్ పనులు పూర్తి చేయాలి : సీపీఐ

యాదగిరిగుట్ట, జూన్ 9 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన పునర్నిర్మాణంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి భక్తులకు సౌకర్యాలు మెరుగుపర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ఈఓ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.1200 కోట్లు కేటాయించి ఆలయాన్ని పునర్నిర్మించిందన్నారు. దాదాపుగా పనులు పూర్తవగా.. భక్తుల మౌలిక వసతుల కల్పన పనులు నిలిచిపోయాయనని తెలిపారు. కొండపైన మరుగుదొడ్లు, మూత్రశాలల సంఖ్య పెంచాలన్నారు. కొండపైనే సత్యనారాయణ వ్రత మండలం ఏర్పాటు చేసి భక్తులకు మైకుల ద్వారా స్వామి నామస్మరణ వినిపించే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. కొండపైకి వెళ్లే దారిని చూపుతూ సూచిక బోర్డు, శని, ఆదివారాల్లో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఆర్టీసీ బస్సులు మెరుగు పర్చాలని డిమాండ్ చేశారు. టెంపుల్ సిటీలో కాటేజీ నిర్మాణాలు చేపట్టి, భక్తుల కోసం కొండపైన వైద్యశాలను ఏర్పాటు చేయాలన్నారు. కొండపైన కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకున్న ఉద్యోగులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్వామివారి స్థిరాస్తులను కాపాడాలని, గిరిప్రదక్షిణ రోడ్డు మెరుగు పరిచి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, జూన్ 9 : మండలంలోని పంతంగి గ్రామంలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఉరివేసుకొని మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన చీరిక హనుమంత్‌రెడ్డి (48) ఆదివారం సాయంత్రం తన ఇంట్లో దూలానికి లుంగీతో ఉరివేసుకొని మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నదని చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మోత్కూరు, జూన్ 9 : మున్సిపాలిటీ పరిధిలోని చౌటబావి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. అడ్డగూడూరు మండలంలోని కోటమర్తికి చెందిన ముత్తయ్య గుండాల వైపు స్కూటీపై వెళ్తుండగా.. అదుపు తప్పి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అటు వైపు వెళ్తున్న వాకర్స్ గమనించి 108 ద్వారా భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ముత్తయ్య కొంత కాలంగా మోత్కూరులోనే ఉంటూ మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడని గ్రామస్తులు తెలిపారు.

## ఆర్టీసీ బస్సుపై దాడి

సంస్థాన్ నారాయణపురం, జూన్ 9 : మండలంలోని కొత్తగూడెం గ్రామ శివారులో గుర్తు తెలియని ఇద్దరు దుండగులు ఆర్టీసీ బస్సుపై రాళ్లతో దాడి చేశారు. దాంతో బస్సు వెనుక భాగంలోని అద్దాలు పగిలిపోయాయి. గమనించిన బస్సు డ్రైవర్ నర్సింహ, కండక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భువనగిరి అర్బన్, జూన్ 9 : భువనగిరి పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సాయికృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ లైన్ నిర్వహణ పని నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని వినాయక చౌరస్తా నుంచి ఎస్ఎల్ఎన్ఎస్ కళాశాల వరకు, పాత బస్టాండ్ నుంచి న్యూ వివేరా హోటల్, సంతోషినగర్, పెంటోజీనగర్, శృతినగర్, సప్తాబజార్, ఠాగూర్‌రోడ్, సంజీవనగర్, హనుమాన్‌వాడ, ఆర్‌బీనగర్‌లలో విద్యుత్ ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రామన్నపేట : ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రామన్నపేట, జూన్ 9 : రామన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1998 – 99 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. ఇటీవల మృతిచెందిన ఉపాధ్యాయులు రవీందర్, బాలనర్సింహకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగరాజు, లెనిన్, కరీం, రవి, రమేశ్, ప్రవీణ్, అమ్జద్, శ్రీను, గంగాధర్, రామకృష్ణ, జగన్, రాము, రాంబాబు, భిక్షపతి పాల్గొన్నారు.

ఆలేరు రూరల్, జూన్ 9 : మండలంలోని కొలనుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2006 – 07 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

**మధుర స్మృతులు పంచుకున్న చిన్ననాటి స్నేహితులు**

చౌటుప్పల్ రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1994 – 95 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో బీఎన్‌రెడ్డి, అంజయ్య, మోహన్‌రెడ్డి, అబ్దుల్, వెంకటయ్య, నవనీత పాల్గొన్నారు.

రాజాపేట : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1969 –70 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం మండలంలోని జాల గ్రామంలో ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా చదువుకునే రోజుల్లో తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

కొలనుపాకలో సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

రాజాపేట : జాలలో ఆత్మీయంగా కలుసుకున్న పూర్వ విద్యార్థులు

## మోడల్ టెస్టుతో విషయ పరిజ్ఞానం పెంపు

జేసీజే మోడల్ టెస్టు పేపర్‌ను విడుదల చేస్తున్న ఐలు అధ్యక్షుడు వెంకటేర్‌డ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్

భువనగిరి అర్బన్, జూన్ 9 : మోడల్ టెస్టు రాయడంతో విషయ పరిజ్ఞానం పెరుగుతుందని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్ అన్నారు. ఐలు ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి (జేసీజే) మోడల్ టెస్టును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడల్ టెస్ట్ వల్ల విద్యార్థికి విషయ పరిజ్ఞానంతో పాటు అర్థవంతమైన అవగాహన ఏర్పడుతుందన్నారు. మోడల్ టెస్టులు రాయడం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. లా చదివిన విద్యార్థులు మోడల్ టెస్టులు రాస్తే ఉన్నత ఉద్యోగాల పరీక్షల్లో రాణించవచ్చని అన్నారు. ఐలు ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని, న్యాయవాదుల సమస్యల పరిష్కారంతోపాటు వారి రంగాల్లో రాణించడానికి విశేష కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. ఐలు జిల్లా ఉపాధ్యక్షుడు కుక్కదువు సోమయ్య, జిల్లా సహాయ కార్యదర్శి బొల్లేపల్లి కుమార్, ఎండీ హమీద్, కిరణ్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, సుమలత పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే కిశోర్ పరామర్శ

బొడ్డుగూడెంలో వసంతరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

అడ్డగూడూరు, జూన్ 9 : మండలంలోని బొడ్డుగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు జక్కుల వసంతరావు, జాగటి పున్నయ్య ఇటీవల మృతిచెందారు. ఆదివారం వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ దర్శనాల అంజయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు, నాయకులు నర్సిరెడ్డి, వెంకన్న, బాబు, కిరణ్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వీరేశానికి ఆహ్వానం

బొడ్రాయి వార్షికోత్సవానికి రావాలని ఎమ్మెల్యే వీరేశానికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

రామన్నపేట, జూన్ 9 : మండలంలోని బోగారం గ్రామంలో ఈ నెల 11నుంచి 14వరకు నిర్వహించే బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం, రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవ వేడుకలను నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు హాజరు కావాలని గ్రామ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే వేముల వీరేశానికి నకిరేకల్‌లో ఆహ్వాన పత్రిక అందజేశారు.

ఎమ్మెల్యేను కలిసిన వారిలో కూనూరు సాయికుమార్, మద్దెపూరి అయిలయ్య, గోగు సత్తయ్య, బొడ్డుపల్లి లింగయ్య ఉన్నారు.

## రాయగిరి మల్లన్న ఆలయంలో చోరీకి యత్నం

- దుండగుడిని పట్టుకున్న స్థానికులు

ఆలయంలో దొంగతనానికి పాల్పడిన నిందితుడు రాజును పట్టుకున్న స్థానికులు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 9 : పట్టణంలోని రాయగిరి మల్లికార్జునస్వామి ఆలయంలో అర్ధరాత్రి దాటిన తరువాత ఓ దుండగుడు చోరీకి యత్నించాడు. దొంగతనానికి పాల్పడిన దుండగుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్‌కు చెందిన పాత నేరస్తుడు రాజు శనివారం అర్ధరాత్రి పట్టణ పరిధి రాయగిరి స్టేషన్ సమీపంలోని మల్లికార్జునస్వామి ఆలయంలోకి దొంగతనానికి వచ్చాడు. ఆలయంలోని లైట్లు, వైరు, గంటలను తీసుకుని పక్కనే చెట్ల పొదల్లో దాచిపెట్టి హుండీని పగులగొట్టే ప్రయత్నం చేశాడు. హుండీ పగులగొడుతున్న క్రమంలో వచ్చే శబ్దాలకు పక్కనే ఉన్న రాయగిరి స్టేషన్‌కు చెందిన పలువురు ఆలయం వద్దకు వచ్చి నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. భువనగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## పాటిమట్ల పాల సంఘం చైర్మన్‌గా లక్ష్మీనర్సింహారెడ్డి

నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులతో చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి

మోత్కూరు, జూన్ 9 : మండలంలోని పాటిమట్ల పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా గ్రామానికి చెందిన రైతు రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గ్రామంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం పాలకవర్గం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా చింత సోమక్క, గోరుపల్లి రఘుపతిరెడ్డి, బండి యాదయ్య, గంగమ్మ ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన చైర్మన్ ఎన్నికల్లో లక్ష్మీనర్సింహారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## చల్లూరు అన్నదాత పాల సొసైటీ చైర్మన్‌గా గాల్‌రెడ్డి

గాల్‌రెడ్డి

రాజాపేట, జూన్ 9 : మండలంలోని చల్లూరు అన్నదాత పాల సొసైటీ చైర్మన్‌గా అర్కాల గాల్‌రెడ్డి 21వ సారి ఎన్నికయ్యారు. ఆదివారం పాలకవర్గ సభ్యులు కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా ధర్మ యాదగిరిరెడ్డి, గుంటి కృష్ణ ఎన్నికైనట్లు మీస బాలమల్లయ్య తెలిపారు.